చరిత్రాత్మక

# రైతు రక్షణ యాత్ర

జులై 1937–మార్చి 1938



కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి



చలసాని వాసుదేవరావు

ఆచార్య వకుళాభరణం రామకృష్ణ

ఎమెస్కో

# రైతు రక్షణ యాత్ర

## ఉపోద్ఘాతం

నూతన శతాబ్దం ప్రారంభమై అప్పుడే సంవత్సరం దాటుతోంది. గత శతాబ్దిలో మానవాళి బహుముఖ పురోగతి సాధించింది. మానవ సమాజం అనేక మార్పులకు గురై చరిత్ర గమనాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళింది. రెండు ప్రపంచ యుద్ధాలు, రెండు ప్రధాన సామ్యవాద విప్లవాలు, అణు విస్ఫోటనం, రోదసీలోకి, అక్కడినుండి చంద్రమండలంపై మానవుడు పాదం మోపడం, ప్రపంచ జనాభా పెరుగుదల : ఈ విధంగా అనేకానేక రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, శాస్త్రీయ, సాంకేతిక ఆవిష్కరణలతో ప్రపంచ స్వరూపమే మారిపోయింది.

భారతీయ సమాజం గత శతాబ్దంలో వలస పాలన నుండి విముక్తి చెంది, యాభై ఏళ్ళ కాలంలో స్వావలంబన దిశగా నడుస్తూంది. స్వాతంత్ర్యానంతరం ఆర్థిక పురోగతి గణనీయంగా సాధించినా, అది ప్రజలందరి కనీసావసరాలకు కూడా సరిపోయేటంతగా లేదు. జరిగిన అభివృద్ధికి తగిన విధంగా ఉత్పత్తిని పంచడంలో న్యాయం జరగడం లేదు. తత్కారణంగా ఆర్థిక వ్యవస్థ అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నది.

ఆర్థిక వ్యవస్థలోని సమస్యలను విశ్లేషించే ఉద్దేశ్యం మాకు ప్రస్తుతం ఈ రచనలో లేదు. భారతీయ ఆర్థిక వ్యవస్థకు ప్రధానాంగమైన వ్యవసాయానికి సంబంధించిన కొన్ని అంశాలను మాత్రమే ఈ అధ్యాయంలో స్థాలీపులాక్ న్యాయంగా ప్రస్తావించ దల్చుకున్నాం. ఆ ప్రస్తావన కూడా పరిచయ రూపంలోనే ఉంటుంది. ఎందుకంటే, ఈ మోనోగ్రాఫ్ లో మేము చెప్పదల్చుకున్నది నేడు వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభం గురించి కాదు. కాకుంటే ఇవాళ మనం చూస్తున్న సంక్షోభం లాంటిదే, వేరో రూపంలో అరవై సంవత్సరాల క్రితం ఆంధ్రదేశంలోని రైతాంగం ఎదుర్కొంది. దానికి వ్యతిరేకంగా ఉ ద్యమాలను చేపట్టింది. గ్రామీణ రైతాంగాన్ని రైతు సంఘాల నిర్మాణం ద్వారా సమీకరించింది. రైతు యాత్రలను నడిపింది. ఈ బృహత్తర ఉద్యమం వలసపాలనలో 1930 దశకం నుండి సంస్థాపరంగా నిర్మించబడిందని మనం గుర్తుంచుకోవాలి.